సాక్షి
విశాఖపట్నం
శనివారం । 19 । జూలై । 2025



ఐఎన్ఎస్ నిస్తార్ జాతికి అంకితం

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో హిందూస్థాన్ షిప్‌యార్డు నిర్మించిన డైవింగ్ సపోర్ట్ వెసల్ ఐఎన్ఎస్ నిస్తార్ యుద్ధ నౌక భారత నౌకాదళ అమ్ములపొదిలో శుక్రవారం చేరింది. నేవల్ డాక్‌యార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి సంజయ్ సేథ్, భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠీ చేతుల మీదుగా నిస్తార్ యుద్ధ నౌకను జాతికి అంకితం చేశారు.

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ రహిత కార్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు



విశాఖ సిటీ: అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మూడో శనివారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణపై అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు దశల వారీగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ప్లాస్టిక్ వస్తువుల కారణంగా జల, వాయు కాలుష్యంతో పర్యావరణానికి కలుగుతున్న హాని గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పార్కులు, బస్, రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశ్రామిక తదితర ప్రాంతాల్లో ఈ నెల మూడో శనివారం స్వచ్ఛందంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

కైలాసగిరిని సందర్శించిన ఇస్రో చైర్మన్



శివపార్వతుల విగ్రహాల వద్ద ఇస్రో చైర్మన్ నారాయణన్

అరిలోవ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ నారాయణన్ శుక్రవారం కైలాసగిరిని సందర్శించారు. గురువారం సాయంత్రమే నగరానికి చేరుకున్న ఆయన.. తన పర్యటనలో భాగంగా కైలాసగిరిని సందర్శించారు. ఇక్కడ వ్యూ పాయింట్ నుంచి కొండలు, సముద్రం అందాలను తిలకించిన నారాయణన్.. కైలాసగిరిపై నిర్వహిస్తున్న జిప్‌లైన్, స్కై సైక్లింగ్ వంటి అడ్వెంచర్ కార్యకలాపాలను ఆసక్తిగా పరిశీలించారు. వాటితో పాటు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గ్లాస్ బ్రిడ్జి అడ్వెంచర్‌ను కూడా పరిశీలించారు. వాటి నిర్వహణ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివపార్వతుల విగ్రహాల వద్ద, పలు విభాగాలకు చెందిన అధికారులతో కలిసి ఫొటోలు దిగారు.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం–కిరండూల్ మధ్య నడిచే ప్రయాణికుల రైళ్ల భద్రతా పనుల నిమిత్తం ఆయా తేదీల్లో కోరాపుట్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కిరండూల్‌– విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ముగిసిన వీఆర్ఎస్ దరఖాస్తు ఉపసంహరణ గడువు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) దరఖాస్తుల ఉపసంహరణ గడువు శుక్రవారం ముగిసింది. సాయంత్రానికి సుమారు 170 మంది ఉద్యోగులు ఉపసంహరించుకున్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ నిర్దేశించిన ఉద్యోగుల తగ్గింపు కార్యక్రమంలో భాగంగా గత నెల ఇచ్చిన రెండో విడత వీఆర్ఎస్ గడువు ఈనెల 15తో ముగిసింది. ఈ వీఆర్ఎస్‌కు 1209 మంది దరఖాస్తు చేశారు. శనివారం ఉదయానికి పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి.

రీ టెండర్‌కు సీఐఎస్ఎఫ్ ఫైర్ కాంట్రాక్టు

సాక్షి, విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తలపెట్టిన ఫైర్ విభాగం కాంట్రాక్టు రీ టెండర్‌కు వెళ్లనున్నట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ ఫైర్ విభాగానికి సంబంధించి ఇటీవల యాజమాన్యం టెండర్లు ఆహ్వానించింది. దానికి సంబంధించి మూడు టెండర్లు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించగా ముగ్గురు క్వాలిఫై కాలేదని తెలిసింది. దీంతో రీ టెండర్‌కు వెళ్లాలని యాజమాన్యం నిర్ణయించినట్టు తెలిసింది. దీంతో ఈ టెండర్ ఫైనలైజేషన్‌లో జాప్యం జరగనుంది.

జీవీఎంసీ అధికారుల అవినీతి ఆసనాలు!

ఒక్కో బయో టాయిలెట్ అద్దె రూ.5,900 అంట
కొత్త బయో టాయిలెట్ ధర రూ.15 వేలు మాత్రమే..

- ఏయూలో 225 ఏర్పాటుకు రూ.13.27 లక్షల మేర చెల్లింపులు
- మొత్తం బయో టాయిలెట్స్ అద్దె బిల్లు రూ.కోటి దాటే అవకాశం
- నేడు స్టాండింగ్ కమిటీలో ఆమోదముద్రకు రంగం సిద్ధం



యోగాడే నాడు ఏయూలో ఏర్పాటు చేసిన బయో టాయిలెట్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ఒక బయో టాయిలెట్ మార్కెట్‌లో రూ.15 వేలకు లభిస్తోంది. బల్క్‌గా కొంటే రూ.10 వేలు నుంచి రూ.12 వేలకు లభించే అవకాశం ఉంది. అయితే, ఘనత వహించిన మన జీవీఎంసీ అధికారులు మాత్రం జూన్ 21వ తేదీన యోగా డే నాడు కేవలం ఒక్క రోజుకే ఒక్కో బయో టాయిలెట్‌కు ఏకంగా రూ.5,900 అద్దె చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఆమోదం పొందేందుకు కూటమి నేతలతో ముందస్తుగా ఒప్పందం చేసుకుని స్టాండింగ్ కమిటీ అజెండాలో పొందుపరచడం గమనార్హం. ఒకవైపు కొత్త బయో టాయిలెట్స్ మార్కెట్ ధరలో మూడోవంతు ధర కేవలం ఒక్క రోజుకే చెల్లించేందుకు జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ అధికారులు సిద్ధపడుతుండటం విమర్శలపాలవుతోంది. కేవలం ఆంధ్రా యూనివర్సిటీలోనే ఏకంగా 225 బయో టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొంటున్నారు. మరోవైపు అక్కడ విడిది ఏర్పాటు చేసిన విద్యార్థులకు మాత్రం టాయిలెట్స్ లేక అనేక రకాలుగా ఇబ్బందులు పడటం విశేషం. అయినప్పటికీ కేవలం ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేశామని చెబుతున్న 225 బయో టాయిలెట్స్‌కు మాత్రమే కేవలం ఒక్క రోజుకే కోనసీమ సస్టైనబుల్ సొల్యూషన్స్ అనే కాంట్రాక్టరుకు రూ.13.27 లక్షల మేర చెల్లించేందుకు శనివారం జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదముద్ర వేసేందుకు రంగం సిద్ధమైంది. ఇక మొత్తం యోగా డే రోజున ఏర్పాటు చేసిన అన్ని బయో టాయిలెట్స్ బిల్లులకే కోటి రూపాయలు అయ్యే అవకాశం ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యోగా డే ఆసనాలకు మించి జీవీఎంసీ అధికారులు చేస్తున్న అవినీతి ఆసనాలు మరింత ఆసక్తి గొలిపేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సిల్వర్ స్వాన్‌కు గులాం..!

మరో మూడేళ్లు లీజు పొడిగించేందుకు సిద్ధం

బీచ్‌రోడ్డులో గతంలో పలు వివాదాలకు కారణంగా నిలిచిన సిల్వర్‌స్వాన్ రెస్టారెంట్ మరోసారి అక్రమాలకు కేంద్రబిందువుగా మారింది. 2009 ఆగస్టు 12 నుంచి 2018 ఆగస్టు 13 వరకూ బీచ్‌రోడ్డులోని 420 చ.గజాల స్థలాన్ని సిల్వర్ స్వాన్ రెస్టారెంట్‌కు జీవీఎంసీ తొమ్మిదేళ్లకు లీజుకు ఇచ్చింది. లీజు గడువు ముగిసినా ఖాళీ చెయ్యకుండా రెస్టారెంట్‌ని నడిపించేశారు. ఈ రెస్టారెంట్‌కు అప్పట్లో 420 చ.గజాల స్థలాన్ని ఇస్తే... పక్కన ఉన్న మరో దాదాపు 1600 చ.గజాల స్థలాన్ని జీవీఎంసీ నిబంధనలకు విరుద్ధంగా తమ ఆధీనంలోకి తీసుకొని సబ్‌లీజులకు ఇచ్చేశారు. ఈ వ్యవహారం అప్పటి జోన్–2(ప్రస్తుతం జోన్–3) రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే జరిగిందనే విమర్శలున్నాయి. అనంతరం లీజును పొడిగిస్తూ వచ్చిన జీవీఎంసీ యంత్రాంగం.. మరోసారి గులాం చేసేందుకే సిద్ధమవుతోంది. ప్రస్తుతం కె.శ్రీనివాసరావు అనే వ్యక్తి పేరు మీద సిల్వర్ స్వాన్‌కు 420 గజాలు మాత్రమే నెలకు రూ.1,60,565 చొప్పున లీజుకు ఇచ్చారు. లీజు తీసుకున్న స్థలానికి నాలుగు రెట్లు ఆక్రమించి మరీ సబ్ లీజులకు ఇస్తూ అప్పనంగా సొమ్ము చేసుకుంటున్నారు.

లీజు రద్దు చేయకపోగా..

సిల్వర్ స్వాన్ రెస్టారెంట్ యాజమాన్యం అనధికారికంగా నిర్వహిస్తున్న డైనో పార్క్‌లో గత ఏడాది ఆగస్టు 13వ తేదీన అగ్నిప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయింది. ఈ నేపథ్యంలో దీని లీజును రద్దు చేస్తామని కూడా అప్పట్లో జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. ఇప్పుడు మాత్రం ఇందుకు భిన్నంగా మరో మూడేళ్ల పాటు లీజు గడువును పొడిగించేందుకు సిద్ధమవుతూ స్టాండింగ్ కమిటీ అజెండాలో అంశంగా చేర్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి సిల్వర్ స్వాన్ యాజమాన్యం ఆక్రమించిన మిగిలిన ప్రాంతాన్ని కూడా భాగాలుగా విభజించి లీజుకు అప్పగిస్తే జీవీఎంసీకి రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. అయినప్పటికీ అక్రమాలను మరో మూడేళ్ల పాటు 2028 మే 26 వరకూ సక్రమం చేసేలా జీవీఎంసీ జోన్–3 అధికారులు ఈ అంశాన్ని చేర్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖలో ప్రో కబడ్డీ

ఆగస్టు 29న పోర్ట్ స్టేడియంలో లీగ్ ప్రారంభ మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: ప్రో కబడ్డీ 12వ సీజన్ ప్రారంభ దశకు విశాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 29వ తేదీన విశాఖలోని పోర్ట్ ఇండోర్ స్టేడియంలో లీగ్ ప్రారంభ మ్యాచ్ జరగనుంది. ప్రోకబడ్డీలో విశాఖకు చెందిన ఫ్రాంచైజీ తెలుగు టైటాన్స్ 2018 తర్వాత నగరంలో మ్యాచ్‌లు ఆడలేదు. హైదరాబాద్ వేదికగానే ఆడుతూ వస్తున్నా ఈసారి టార్గెట్ రేటింగ్ పాయింట్లు(టీఆర్పీ)ని పెంచుకునేందుకు విశాఖలో మ్యాచ్‌లు నిర్వహించాలని ఫ్రాంచైజీ యాజమాన్యం నిర్ణయించుకుంది. విశాఖ, హైదరాబాద్ రెండూ హోమ్ గ్రౌండ్స్‌గా యాజమాన్యం పరిగణించినా ఈసారి విశాఖకు మారింది. తెలుగు టైటాన్స్ మ్యాచ్‌లు విశాఖ పోర్ట్ స్టేడియంలో మరోసారి జరగనున్నాయి. లీగ్ మ్యాచ్‌లు విశాఖతో పాటు జైపూర్, చెన్నై, న్యూఢిల్లీల్లో జరగనున్నాయి. అయితే ప్లేఆఫ్, ఫైనల్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటికే అన్ని ఫ్రాంచైజీలు తమ ఆటగాళ్లను వేలంలో కొనుగోలు చేసుకున్నాయి.

తెలుగు టైటాన్స్‌కు ఆడేది వీరే..

తెలుగు టైటాన్స్ 12వ సీజన్‌లో ఆల్‌రౌండర్ హుడాను, రైట్‌కార్నర్‌లో డిఫెండ్ చేసేందుకు శుభమ్‌ను, రైడర్ అమీర్‌ను వేలంలో దక్కించుకుంది. ఆల్‌రౌండర్లు విజయ్, సంజీవి, వన్, రైట్ రైడర్స్‌గా మన్జీత్, ఆశిష్, ఓంకార్, లెఫ్ట్ రైడర్స్‌గా ప్రఫుల్, నితిన్, రోహిత్, సెంటర్‌లో చేతన్, రైట్ కార్నర్‌లో కృష్ణన్, శంకర్, సాగర్, అమిత్, మిలాద్, లెఫ్ట్ కార్నర్‌లో అంకిత్, సుందర్, మలక్, అజిత్ జట్టుకు ఆడే అవకాశాలున్నాయి.

నేడు స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శనివారం జరగనుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశంలో 60 అంశాలను సభ్యులు చర్చించనున్నారు.

కేకే లైన్‌లో 3 అంచెల రక్షణ వ్యవస్థ

- కొండచరియల సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ.కోట్ల నష్టాన్ని నివారించేందుకు వాల్తేరు డివిజన్ నిర్ణయం
- త్వరలోనే టెండర్లకు ఆహ్వానం



కేకే లైన్‌లో విరిగిపడిన కొండచరియలు(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: కేకేలైన్‌లో కొండచరియల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు కీలక చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో తరచుగా కొండచరియలు విరిగిపడి రైల్వే ట్రాక్ దెబ్బతింటున్న నేపథ్యంలో, దీనికి చెక్ పెట్టేందుకు మూడు అంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. త్వరలోనే టెండర్లు ఆహ్వానించేందుకు సన్నద్ధమవుతున్నారు.

కొత్తవలస–కిరండూల్ లైన్.. కొండల మధ్యలో ఏర్పాటు చేసిన ఎత్తైన రైల్వే ట్రాక్ ఇది. దీన్నే కేకే లైన్ అని పిలుస్తారు. సరకు రవాణా కోసం ఈ లైన్‌ను వినియోగిస్తుండగా.. చిన్నపాటి వర్షం కురిసినా.. కొండచరియలు విరిగి ట్రాక్‌పై పడుతున్నాయి. ఏటా 5 నుంచి 10 సార్లు ఇదే పరిస్థితి నెలకొంటుంది. ప్రతిసారి ట్రాక్ పునరుద్ధరణ పనులకు వాల్తేరు రైల్వే డివిజన్ లక్షల రూపాయలు ఖర్చు చేస్తోంది. ఆ సమయంలో రైళ్ల రాకపోకలు 2 నుంచి 3 రోజుల పాటు నిలిచిపోతున్నాయి. ఈ కారణంగా వాల్తేరు డివిజన్‌కు రూ.కోట్లల్లో నష్టం వాటిల్లుతోంది. కేకే లైన్ నిర్మించినప్పటి నుంచి కొండచరియలు విరిగిపడటం, రైళ్లు రద్దు చేయడం, మార్గంలో ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టడం అనేది నిరంతర ప్రక్రియగా మారింది. ఈ నేపథ్యంలో తరచూ కొండ చరియలు విరిగిపడుతున్న ప్రాంతాలను గుర్తించి.. రక్షణ చర్యలు చేపట్టాలని తాజాగా రైల్వే అధికారులు నిర్ణయించారు.

మూడు లేయర్లతో రక్షణ వ్యవస్థ

కొత్తవలస–కిరండూల్ మార్గంలో ఎక్కడెక్కడ, ఎన్నిసార్లు కొండచరియలు విరిగిపడ్డాయో వాల్తేరు రైల్వే అధికారులు గణాంకాలు సేకరిస్తున్నారు. ఈ సమాచారాన్ని క్రోడీకరించిన తర్వాత, తరచుగా కొండచరియలు విరిగిపడి ట్రాక్ దెబ్బతింటున్న ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించనున్నారు. ఈ అంశంపై డీఆర్ఎం లలిత్ బోహ్రా ఇటీవల **సమీక్ష నిర్వహించారు.** కేకే లైన్‌లోని ఇబ్బందులపై స**మగ్ర నివేదికను** సిద్ధం చేయాలని సంబంధిత అధికా**రులను ఆదేశించారు.** ఈ నివేదిక ఆధారంగా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మూడు అంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ వ్యవస్థలో భాగంగా కొండల వెంబడి భారీ మెష్‌ను ఏర్పాటు చేస్తారు. అలాగే కట్ స్లోప్‌లలో స్టీల్ వైర్ మెష్ ప్రొటెక్షన్, స్టీల్ బౌల్డర్ నెట్, రాక్‌ఫాల్ బారియర్లను పెడతారు. సుమారు 1,500 కిలోల సామర్థ్యంతో ఈ రాక్‌ఫాల్ బారియర్లను అమర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇవి కాకుండా పలు ప్రాంతాల్లో రీన్‌ఫోర్స్‌డ్ గేబియన్ బ్లాక్స్, రాక్‌షెడ్‌లను ఏర్పాటు చేసే అవకాశాలపై కూడా వాల్తేరు అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఈ రాక్‌ఫాల్ బారియర్స్ కొండచరియలు ట్రాక్‌పై పడకుండా దాదాపు పూర్తిగా నిరోధిస్తాయి. ఒకవేళ ఈ బారియర్ల సామర్థ్యాన్ని మించి భారీ బండరాళ్లు పడినా, అవి ట్రాక్‌ను పూర్తిస్థాయిలో దెబ్బతీయకుండా అడ్డుకుంటాయి. దీనివల్ల పునరుద్ధరణ పనులను గంటల వ్యవధిలో పూర్తి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.



రాక్‌ఫాల్ బారియర్స్ ఏర్పాటు ఇలా..

స్వచ్ఛ విశాఖ చతికిలబడి



స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో జీవీఎంసీ ర్యాంకు దిగజారింది. పది లక్షలకు పైబడిన జనాభా కలిగిన నగరాల కేటగిరీలో గత రెండేళ్లుగా టాప్–4 ర్యాంకుతో వెలిగిన విశాఖ కీర్తి.. కూటమి ప్రభుత్వ హయాంలో 9వ ర్యాంకుకు పడిపోయింది. ఇది కేవలం ర్యాంకుల పట్టికలో అంకెల పతనం కాదు.. నగర పాలనపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం, తీవ్ర నిర్లక్ష్యానికి నిలువుటద్దమని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్యం క్షీణించడం, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ లేకపోవడం, డంపింగ్‌యార్డ్‌లో చెత్త రీసైక్లింగ్, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోవడమే ఈ ర్యాంకు పతనానికి ప్రధాన కారణాలని స్పష్టమవుతోంది.

- నాడు 4వ ర్యాంకు.. నేడు 9వ ర్యాంకుకు పతనం
- పాలకుల పట్టింపులేకే.. పారిశుధ్యంలో వెనక్కి..
- కూటమి అసమర్థ పాలనకు ఇదే నిదర్శనమంటున్న నగర ప్రజలు

డాబాగార్డెన్స్ : స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో మొత్తం 12,500 మార్కులకు పోటీ నిర్వహించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ, విభజన, చెత్తను సంపదగా మార్చడం, మార్కెట్లు, రోడ్లు, జనావాసాలు, ప్రజా మరుగుదొడ్లు, కాలువలు శుభ్రంగా ఉంచడానికి సంబంధించి 10,000 మార్కులు కేటాయించారు. అలాగే డంపింగ్ యార్డులో చెత్త నిల్వలు లేకుండా చూడటం, బహిరంగ మల విసర్జన నిర్మూలించడం ,మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి వాడడం వంటి వాటికి 2,500 మార్కులు కేటాయించారు. అయితే స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో జీవీఎంసీ 11,636 మార్కులు మాత్రమే సాధించింది. కాపులుప్పాడ డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ద్వారా చెత్తను పూర్తిగా నిర్మూలించడంలో విఫలమైంది. 2025 జనవరి నాటికి యార్డ్‌లో చెత్త లేకుండా చూడాల్సి ఉండగా, దాదాపు 20 శాతానికి పైగా చెత్త ఇంకా పేరుకుపోయి ఉండటంతో 'గార్బేజ్ ఫ్రీ సిటీ' కేటగిరీలో రేటింగ్ కోల్పోయింది. ఈ కేటగిరీలో ఫైవ్ స్టార్ ర్యాంకు సర్టిఫికెట్‌ను మాత్రమే కేంద్రం జారీ చేసింది.

పాలన మారగానే పతనం

రాష్ట్రంలో పాలన మారిన వెంటనే పరిస్థితి తలకిందులైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవీఎంసీకి ఐదారు నెలలుగా పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించకపోవడంతో పాలన పూర్తిగా గాడితప్పింది. పాలకుల పర్యవేక్షణ కొరవడటంతో అధికారుల్లో ఉదాసీనత, క్షేత్రస్థాయి సిబ్బందిలో అలసత్వం పెరిగిపోయాయి. ఫలితంగా నగరంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు, అధ్వానంగా మారిన ప్రజా మరుగుదొడ్లు, నిర్వహణకు నోచుకోని డంపింగ్ యార్డ్.. ఇవన్నీ కలిసి విశాఖ స్వచ్ఛ కీర్తిని మసకబార్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో జరిగిన రోడ్ల విస్తరణ, జంక్షన్ల ఆధునికీకరణ, తాగునీటి ప్రాజెక్టులు, పట్టణ పేదల జీవన ప్రమాణాల మెరుగుదల వంటి అభివృద్ధి కార్యక్రమాలతో కళకళలాడిన విశాఖ.. నేడు ఈ పరిస్థితికి చేరడం కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 4

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'స్వచ్ఛ సంకల్పం', 'క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)' వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలతో విశాఖ నగరం పారిశుధ్య నిర్వహణలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇంటింటికీ ఉచితంగా చెత్త బుట్టలు అందించారు. తడి–పొడి చెత్త విభజనపై అవగాహన కల్పించారు. వాహనాల ద్వారా పారిశుధ్య కార్మికులు ప్రజల నుంచి చెత్త సేకరించే విధానాన్ని అమలు చేశారు. మరీ ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు 'ఎకో క్లీన్', 'ఎకో గ్రీన్', 'ఎకో బ్లూ', 'ఎకో జీరో ప్లాస్టిక్', 'ఎకో జీరో పొల్యూషన్' పేరిట 'ఎకో వైజాగ్' ప్రారంభించారు. 'ఎకో గ్రీన్' కింద చెట్ల పెంపకం, కమ్యూనిటీ గార్డెనింగ్ వంటి వాటితో పచ్చని నగరంగా తీర్చిదిద్దారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రోత్సహించారు. తద్వారా జీవీఎంసీ వరుసగా 2022, 2023 సంవత్సరాల్లో జాతీయ స్థాయిలో 4వ ర్యాంకును కైవసం చేసుకుంది.

ఎస్సీల అభ్యున్నతికి కృషి చేయాలి

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్

మద్దిలపాలెం: అధికార యంత్రాంగం ఎస్సీల అభ్యున్నతికి కృషి చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్సీల సంక్షేమం, అభివృద్ధిపై జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమీక్షించారు. జిల్లాలో ఉన్న 44 శాఖల అధికారులు ఎస్సీలకు మేలు చేసే దిశలో పని చేయాలన్నారు. ప్రధాని మోదీ ఎస్సీల కోసం ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ. 5 కోట్ల వరకు 50 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నారన్నారు. బ్యాంకర్లు, అధికారులు ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ముందుగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో ఎస్సీలకు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వసతి గృహాలు, పాఠశాలల వివరాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, తీసుకుంటున్న చర్యలను సీపీ శంఖబ్రత బాగ్చి వివరించారు. ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీల్ కుమార్ బాబు, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీ శంకర్, సాంఘిక సంక్షేమ ఉప సంచాలకుడు రామారావు, కమిషన్ అధికారులు నవీన్, వరప్రసాద్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ అమలు చేయాలి

మల్కాపురం : హెచ్‌పీసీఎల్ ఉద్యోగ నియామకాల్లో 15 శాతం రిజర్వేషన్ ప్రక్రియను పక్కాగా అమలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హెచ్‌పీసీఎల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం సంస్థలోని వివిధ విభాగాల పనితీరును ప్రాజెక్ట్ ద్వారా ఉన్నతాధికారులు వివరించారు. తర్వాత ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామచందర్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎం.ఎస్.ఎం.ఈ టెండర్ల ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చూడాలని, విద్యార్థుల పుస్తకాల పంపిణీ కోసం గతంలో కేటాయించే రూ. 12 లక్షల నిధులను పునరుద్ధరించాలని సంస్థ ఈడీ, సీజీఎంలను ఆయన ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్

జనసేన కార్పొరేటర్ వేధింపులు

- పీతల మూర్తి యాదవ్ తమ పొట్టకొడుతున్నారు.
- న్యాయం చేయాలని జీవీఎంసీ కమిషనర్‌కు 22వ వార్డు ఆర్పీల వేడుకోలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి తమ పొట్టలు కొడుతున్నారని ఆర్పీలు చంద్రకళ, జానకి వాపోయారు. కార్పొరేటర్ తీరును నిరసిస్తూ శుక్రవారం వార్డు పరిధిలోని పిఠాపురంకాలనీ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. జీవీఎంసీ సమీపంలోని ఓ హోటల్‌లో కార్పొరేటర్ పీతల మూర్తి ఉన్నారని తెలిసి, వారు గ్రూపు సభ్యులతో కలిసి ఆ హోటల్‌ను ముట్టడించారు. పోలీసులు రంగంలోకి దిగి, ఈ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించడంతో వెనుదిరిగారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ పేషీ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్పీలు మీడియాతో మాట్లాడుతూ గత ఏడేళ్లుగా 22వ వార్డులో సభ్యులను చైతన్య పరుస్తూ.. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్‌గా పీతల మూర్తి వచ్చిన నాటి నుంచి తమను అనేక రకాలుగా వేధిస్తున్నారని ఆరోపించారు. అతనికి అనుకూలంగా లేమంటూ.. వార్డులో ఉన్న ఐదుగురు ఆర్పీల్లో ఇద్దరిని తొలగించమని పీతల మూర్తి యూసీడీ పీడీ సత్యవేణిపై తీవ్ర ఒత్తిడి తెచ్చారన్నారు. ఆమెపై కేకలు వేస్తూ తమను తొలగించాలని ఒత్తిడి చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నెలకు రూ.8 వేల జీతంతో పనిచేస్తున్నామని, ఎనిమిది నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేదని వాపోయారు. జీవీఎంసీ కమిషనర్, మెప్మా ఎండీ స్పందించి మూర్తి యాదవ్ వేధింపులు ఆపి, తమకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ పేషీ ముందు నిరసన తెలుపుతున్న ఆర్పీలు

స్పా సెంటర్లపై దాడులు


స్పాలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బీచ్‌రోడ్డు: నగరంలో స్పా సెంటర్ల ముసుగులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రామాటాకీస్ నుంచి సిరిపురం వెళ్లే దారిలోని మినీ థాయ్ స్పా సెంటర్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఢిల్లీతో సహా ఉత్తర భారతదేశానికి చెందిన యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ భరత్ తన సిబ్బందితో గురువారం రాత్రి దాడులు చేపట్టారు. ఈ దాడిలో ముగ్గురు ఉత్తరాది యువతులతో పాటు విశాఖకు చెందిన మరో ఇద్దరు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకుని రెస్క్యూ హోంకు తరలించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న నిర్వాహకుడు రాజేష్‌తో పాటు ఒక విటుడిని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ స్పా సెంటర్ యజమాని విజయవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భాస్కరరావు తెలిపారు. విశాఖలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ భరత్ కోరారు.

ద్వారకానగర్‌లో..

తాటిచెట్లపాలెం: ద్వారకానగర్‌లోని లావిష్ స్పా సెంటర్‌పై శుక్రవారం ద్వారకా పోలీసులు దాడులు నిర్వహించారు. ఇక్కడ అనధికారికంగా క్రాస్ మసాజ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఈ దాడులు జరిగాయి. స్పా నిర్వాహకుడైన కిశోర్‌తో పాటు నలుగురు యువతులు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న యువతుల్లో ఇద్దరు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు కాగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఒక్కొక్కరున్నారు. ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేంజ్ మేకర్.. సత్య

- **మహిళా సాధికారతే ఆమె లక్ష్యం**
- **సెల్ఫ్ డిఫెన్స్.. సోషల్ జస్టిస్.. ఫిజికల్ ఫిట్‌నెస్‌పై అవగాహన**
- సౌత్ ఇండియా వుమెన్ అచీవర్స్–2025 అవార్డు గెలుచుకున్న సత్యకుమారి

డాబాగార్డెన్స్: పది మందికి సేవ చేయాలని.. సమాజంలో అట్టడుగున ఉన్న పిల్లలు సామాజికంగా ఎదగాలన్నదే ఆమె తపన.. మరీ ముఖ్యంగా ఆడపిల్లలు సమాజంలో రాణించాలని.. ధైర్యంగా నిలబడాలన్నదే తన లక్ష్యం. చదివింది డిగ్రీ. తల్లిదండ్రులు రేషన్ డిపో నడుపుతున్నారు. తనదైన శైలిలో ఎంతో మంది పాఠశాల పిల్లలు.. కళాశాల విద్యార్థులకు సోషల్ జస్టిస్.. సెల్ఫ్ డిఫెన్స్.. ఫిజికల్ ఫిట్‌నెస్.. ఉమెన్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తూ వారంతా రాటుదేలేలా తీర్చిదిద్దుతున్నారు ఉన్నవ వెంకట సత్యకుమారి. ఇటీవల చెన్నైలో నిర్వహించిన సౌతిండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు–2025 గెలుచుకుని మరెంతో మంది మగువలకు స్ఫూర్తిగా నిలిచారు.

వివరాల్లోకి వెళ్తే.. ఉన్నవ సత్యకుమారి డిగ్రీ వరకు చదివారు. అక్కయ్యపాలెంలో నివాసముంటున్నారు. రేషన్ డిపో నడిపే తల్లిదండ్రులతో పాటు ఇంజినీరింగ్ పూర్తి చేసిన సోదరుడు ఉన్నారు. ఈ నెల 9న చెన్నైలోని ఎంసీసీ స్కూల్ ఆడిటోరియంలో నిర్వహించిన సౌత్ ఇండియా వుమెన్ అచీవర్స్ అవార్డుల కార్యక్రమంలో సత్యకుమారి ఛేంజ్‌మేకర్ విభాగంలో నామినేట్ అయ్యారు. ఆడపిల్లలు నిస్సందేహంగా సబలలని.. వారికి అవకాశం ఇచ్చి చూస్తే అద్భుతాలు సాధిస్తారని నిరూపించేలా సత్యకుమారి ఎంతో మంది పాఠశాల.. కళాశాలల విద్యార్థినులతో నిరూపించారు. ఫిజికల్ ఫిట్‌నెస్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి అంశాలను వారికి బోధించి చక్కటి ఫలితాలు సాధించిన నేపథ్యంలోనే ఆమెను ఈ అవార్డు వరించింది. సత్యకుమారి ప్రతిభను ట్వెల్ మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ చీఫ్, వ్యవస్థాపకుడు దీపక్ టాటర్ జైన్ నాయకత్వంలోని ఎంపిక కమిటీ గుర్తించింది. సివా పేరిట మహిళల సాధికారత, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల్ని గుర్తించి అవార్డులు అందజేసే క్రమంలో సత్యకుమారిని కూడా గుర్తించి అవార్డుతో గౌరవించింది.


సీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటూ...


వివిధ విభాగాల్లో అవార్డులు పొందిన వారితో...

60 వేల దరఖాస్తులు రాగా..

సౌత్ ఇండియా వుమెన్ అచీవర్స్ అవార్డ్–2025కి దేశవ్యాప్తంగా 60 వేల దరఖాస్తులు అందాయి. సమాజ సేవ.. మహిళల సాధికారత.. వివిధ రంగాల్లో రాణిస్తున్న 300 మంది మహిళలను గుర్తించి అవార్డులు అందజేశారు. వీరిలో విశాఖ నగరానికి చెందిన ఉన్నవ వెంకట సత్యకుమారి చేంజ్ మేకర్ విభాగంలో తను చేస్తున్న సమాజ సేవకు గుర్తింపు లభించింది.


అవార్డు అందుకుంటున్న సత్యకుమారి

సేవ చేయడంలో సంతోషం

అవార్డు సాధించిన సత్యకుమారి 'సాక్షి'తో మాట్లాడుతూ మన కాళ్ల మీద మనం బతకడం ముఖ్యం. అక్కడితో ఆగక.. మనం నేర్చుకున్న విద్య.. సంస్కృతి వంటివి పది మందికి తెలపడం మరింత సంతోషాన్నిస్తుంది. ఈ ఏడాది జనవరి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ.. సోషల్ జస్టిస్, ఫిజికల్ ఫిట్‌నెస్, సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించాను. కల్పిస్తున్నాను కూడా. నగరంలోని ప్రేమ సమాజం వృద్ధులకు సోషల్ జస్టిస్‌పై అవగాహన కల్పించాను. ప్రతి ఒక్కరూ తాము ఎదుగుతూ.. పది మందికి సేవ చేయాలనే తపన ఉండాలని, మనకు తెలిసిన విద్యను బడుగు.. బలహీన వర్గాల పిల్లలకు అందజేస్తే వారు మరింత ఉన్నత స్థితికి చేరుకుంటారని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు, బాల బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ ముఖ్యమని, నానాటికీ పెరుగుతున్న



దాడులను ఎదుర్కోవాలంటే సేఫ్టీ, సోషల్ జస్టిస్, ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన ఉండాలని అభిలషించారు. తను చేస్తున్న అవగాహన.. సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ ఏడాది ఏప్రిల్ 27న దేశ రాజధాని న్యూఢిల్లీలో భారతీయ భరతనాట్య నృత్యకారిణి, నటి సుధా చంద్రన్, మిస్ ఇండియా మంజీర చేతుల మీదుగా 'నారీ శక్తి' అవార్డు అందుకున్నానని తెలిపారు. అలాగే విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రశంసలు లభించాయని, తాజాగా చెన్నైలో జరిగిన సౌత్ ఇండియా వుమెన్ అచీవర్స్ అవార్డు–2025ను పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నట్టు సత్యకుమారి తెలిపారు.

ఇన్‌చార్జిల పాలనలో పాలిటెక్నిక్


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

- ప్రతిష్టాత్మక కళాశాలపై అధికారుల చిన్నచూపు
- గాడి తప్పిన విశాఖ టెక్నాలజీ సెంటర్

విశాఖ సిటీ: ప్రతిష్టాత్మక విశాఖపట్నం (కంచరపాలెం) ప్రభుత్వ పాలిటెక్నిక్‌పై అధికారులు సీతకన్ను వేశారు. ఏటా వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్న కాలేజీని ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. కాలేజీకి పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ లేకపోవడంతో పాలన గాడి తప్పుతోందనే విమర్శలున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ ఈ కళాశాలను ప్రభుత్వం పట్టించుకోలేదు. విజయవాడలోని టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డులో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న అధికారికే పాలిటెక్నిక్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన ఈ పోస్టులో పూర్తి స్థాయిలో పని చేస్తూనే, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా కొనసాగేలా అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

ఇన్‌చార్జిల పాలన మొదలైందిలా..

ఇక్కడ ప్రిన్సిపాల్‌గా చేస్తున్న జీవీవీ సత్యనారాయణ మూర్తి టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డుకు జాయింట్ సెక్రటరీగా డిప్యుటేషన్‌పై వెళ్లినప్పటి నుంచి ఇక్కడ ఇన్‌చార్జిల పాలన మొదలైంది. ఆయన ప్రిన్సిపాల్‌గా కొనసాగుతూ ఉండగానే ఈ కాలేజీకి ఎలక్ట్రికల్ హెడ్ కేడీవీ నరసింహారావు ఇన్‌చార్జిగా చేసేవారు. సత్యనారాయణ మూర్తి ఇక్కడ ఉండగానే ఈ కాలేజీని నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్‌కు సిద్ధం చేశారు. ఆయన డిప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో ఎన్‌బీఏ పనులు పడకేశాయి. దీంతో ఎన్‌బీఏ పనులు వేగవంతం చేయడానికి అప్పటి కమిషనర్ సి.నాగరాణి ఆముదాలవలస ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావును ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. దీంతో పనులు ఓ కొలిక్కి వచ్చి ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. అంతేకాకుండా ఇక్కడ జోనల్, రాష్ట్ర స్థాయి అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు, రాష్ట్రస్థాయి టెక్‌ఫెస్ట్, జాతీయ స్థాయిలో సింపోజియంలు విజయవంతంగా నిర్వహించారు. ఇక్కడి విద్యార్థులు అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించి రికార్డు సృష్టించారు. కాలేజీని కార్పొరేట్‌కు దీటుగా తయారైన సందర్భంలో బదిలీల పర్వంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ఉమ్మడి విశాఖకు సమన్వయ కేంద్రంగా..

ఈ కాలేజీలో సాంకేతిక విద్యకు సంబంధించిన కార్యక్రమాలు నిత్యం జరుగుతూ ఉంటాయి. రాష్ట్రస్థాయిలో అధ్యాపకులకు ఓరియంటేషన్ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఏఐసీటీఈ ఆధ్వర్యంలో కార్యక్రమాలు, కరిక్యులమ్ ఫ్రేమ్ వర్కు జరుగుతాయి. ఈ కాలేజీ విశాఖపట్నం ఉమ్మడి జిల్లాకు కో–ఆర్డినేటింగ్ కేంద్రంగా పని చేస్తుంది. ఈ కాలేజీ ప్రాంగణంలోనే జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాలి. నిరంతరం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలు జరుగుతుంటాయి. ప్రతి కార్యక్రమం అమలుకు ఆర్థికపరమైన అవసరాలు ఉంటాయి. వాటికి ప్రిన్సిపాల్ అనుమతి తప్పనిసరి. దీంతో బోర్డు కార్యాలయంలో కార్యదర్శిగా పని చేస్తున్న ప్రిన్సిపాల్ కోసం ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ కళాశాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌ను నియమించి, ఈ కాలేజీకే పరిమితం చేస్తే కళాశాల ప్రతిష్ట మరింత ఇనుమడిస్తుందని పలువురు భావిస్తున్నారు.

ఘన చరిత్ర

1956లో ఏర్పాటైన ఈ పాలిటెక్నిక్ కాలేజీ కాకినాడ తర్వాత అతి పెద్ద కాలేజీగా గుర్తింపు పొందింది. ఇక్కడ మెకానికల్ మూడు సెక్షన్లు, సివిల్, ఎలక్ట్రికల్ రెండు సెక్షన్లు, మెటలర్జీ, ఫార్మసీ ఒక సెక్షన్ చొప్పున ఉన్నాయి. 1700 మందికి పైగా విద్యార్థులు, 52 మంది అధ్యాపకులు, 55 మంది సహాయక స్టాఫ్ ఉన్నారు. దీనికి అనుబంధంగా నలంద, నాగార్జున వసతి గృహాలు ఉన్నాయి.

మద్యం మత్తులో స్నేహితుడిపై రౌడీషీటర్ దాడి


నాగెల్ల సాయి(ఫైల్)

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన వాగ్వాదం దాడికి దారి తీసింది. రౌడీషీటర్ నాగెల్ల సాయి తన స్నేహితుడిపై చిన్న కత్తెరతో దాడికి పాల్పడిన ఘటన కలకలం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి.. గతంలో చాకలిగెడ్డలో నివాసమున్న నాగెల్ల సాయిపై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉండేది. అయితే, అతను పెందుర్తికి వెళ్లిపోవడంతో ఆ కేసును గత ఏడాది జూలైలో పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఇదిలా ఉండగా.. కంచరపాలెం ప్రాంతంలో స్నేహితులంతా ఉండటంతో, గురువారం సాయంత్రం సాయి వారిని కలిసేందుకు వచ్చాడు. ఈ క్రమంలో సాయి, గోశాల మూర్తితో పాటు మరికొందరు స్నేహితులు కలిసి మద్యం సేవించారు. అక్కడికి సాయికి తెలిసిన ఒక మహిళ రావడంతో ఆమె ఎవరని మూర్తి ప్రశ్నించాడు. సాయి తీసుకువచ్చాడని మరో స్నేహితుడు బదులిచ్చాడు. దీంతో మూర్తి 'ఇక్కడ ఆమె ఎందుకు? పంపించేయండి'అని చెప్పడంతో సాయికి, మూర్తికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సాయి తన వెంట తెచ్చుకున్న చిన్న మీసాల కత్తెరతో మూర్తి మెడ కుడివైపు దాడి చేశాడు. వెంటనే గమనించిన స్థానికులు 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన మూర్తిని ఆస్పత్రికి తరలించారు. ఈ లోగా నైట్‌డ్యూటీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సాయిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అయితే మద్యం మత్తులో ఉన్న సాయి రక్షక్ వాహనం ఎక్కేందుకు మొండికేయడంతో.. ఆ వాహనం వెనుక వైపు అద్దం పగిలింది. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సీఐ రవికుమార్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.5 లక్షలు పరిహారం

విశాఖ సిటీ : రోడ్డు ప్రమాద బాధితులకు రూ.5 లక్షలు పరిహారం అందజేశారు. రోడ్డు ప్రమాదలో మరణించిన, గాయపడిన వారికి పరిహారం అందించేందుకు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఇటీవల హిట్ అండ్ రన్‌లో చనిపోయిన కోటిచుక్కల ఏసుబాబు, గండిబోయిన వెంకట జగన్‌మోహన్‌లకు ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు చొప్పున, తీవ్ర గాయాలపాలైన చెల్లుబోయిన రాజారావు, కరణం అప్పలనాయుడులకు రూ.50 వేలు చొప్పున పరిహారాన్ని బాధితులు, వారి కుటుంబ సభ్యుల ఖాతాల్లో జమచేశారు. ఇప్పటి వరకు ఈ కేంద్రం ద్వారా 63 మంది బాధితులకు రూ.52.5 లక్షలు పరిహారం ఇచ్చారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఎవరికైనా సహాయం కోసం రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రంలో గానీ, టోల్ ఫ్రీ నెంబర్ 7995095793కు సంప్రదించాలని పోలీసులు సూచించారు.

పక్కాగా.. పర్ఫెక్ట్‌గా.!


భారత త్రివిధ దళాలు అంటేనే క్రమశిక్షణకు మారుపేరు. రక్షణ దళాలు తమ విధుల్లో అయినా, ధరించే యూనిఫాంలో అయినా పరిపూర్ణతను పాటిస్తాయి. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో శుక్రవారం ఐఎన్ఎస్ నిస్తార్ యుద్ధ నౌక జాతికి అంకితం చేసిన కార్యక్రమంలో ఈ దృశ్యం కనిపించింది. ప్రముఖ అతిథులకు నేవీ బ్యాండ్ స్వాగతం పలుకుతుండగా.. ఒక సెయిలర్ బ్యాండ్ సభ్యుని యూనిఫాంను సరిచేస్తూ కనిపించాడు. మన సైనిక బలగాల ప్రతి కదలికలోనూ కనిపించే పర్ఫెక్షన్‌కు ఈ చిత్రం నిదర్శనం.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.96
స్కిన్	: రూ.162
స్కిన్‌లెస్	: రూ.172

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

పోలీసుల అదుపులో నకిలీ నేవీ అధికారి

అసలు విషయం తెలిసి పోలీసులు షాక్

మల్కాపురం: అగనంపూడి ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల యువకుడు నేవీ అధికారిగా తల్లిదండ్రులను సంతోషపెట్టాలని చూశాడు. అయితే అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన నేవీ అధికారి మల్కాపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. అగనంపూడి వద్ద గల ఎడుమెట్ల మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ప్రవాది సురేష్ ఉన్నత చదువులు చదివినా ఉపాధి లభించలేదు. తనకు ఉద్యోగం రాక తల్లిదండ్రులు బాధపడుతున్నారని గ్రహించి, వారిని సంతోషపెట్టడం కోసం కొద్ది రోజుల కిందట నేవీ ఉన్నతాధికారి వేషం వేశాడు. ఇందులో భాగంగా శుక్రవారం ఉద్యోగానికి వెళ్తున్నానని తన తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ వద్ద గల ఏసీబీ కార్యాలయానికి సమీపంలోని ఒక షాపు వద్ద కాలక్షేపం చేస్తున్నాడు. ఇక్కడ రెస్టారెంట్‌లు, టైలరింగ్, ఇతర షాపులు ఉంటాయి. వీటికి ఎదురుగా నేవీ ఉన్నతాధికారుల క్వార్టర్స్ ఉన్నాయి. దీంతో అధికారులు నిత్యం వివిధ సామాన్లు కొనుగోలుకు ఇక్కడకు వస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నేవీ లెఫ్టినెంట్ ఒకరు కారులో దుకాణం వద్దకు వచ్చారు. ఆ సమయంలో సురేష్ అక్కడ ఉండటం, ఆ ఉన్నతాధికారికి సెల్యూట్ చేయకపోవడంతో అతనికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వచ్చి అతన్ని పట్టుకుని స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా అసలు విషయం చెప్పాడు. తన తల్లిదండ్రులను సంతోషపరచడం కోసమే తాను ఈ వేషం వేశానని, దీని వల్ల ఎవరినీ మోసం చేయలేదని చెప్పాడు. ఈ అంశంపై నేవీ అధికారి ఎలాంటి రాతపూర్వకమైన ఫిర్యాదు చేయలేదని.. వారు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ భూముల్లోనే మెట్రో స్టేషన్లు నిర్మించండి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్, ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన నిర్వాసితులు

జగదాంబ: విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్–1 నిర్మాణంలో భాగంగా శుక్రవారం ఇందిరా గాంధీ మున్సిపల్ క్రికెట్ స్టేడియంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధా సాగర్ భూములు, నివాసాలు, వ్యాపారాలు, ఖాళీ స్థలాలను కోల్పోతున్న నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లో భాగంగా 46.23 కిలోమీటర్ల పొడవున కారిడార్ ఫేజ్–1, 2, 3లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం 9.22 ఎకరాల పట్టా భూమిని, 87 ఎకరాల ప్రభుత్వ భూమిని భూసేకరణ ద్వారా సేకరించాల్సి ఉందన్నారు. 'కారిడార్–1లో మొత్తం 94 నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలు ప్రభావితమవుతున్నాయి. కారిడార్–2లో 312 గృహ, వ్యాపార, ఖాళీ స్థలాలు నష్టపోతున్నాయి. అదనంగా మరో 192 నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలు ప్రభావితమవుతాయి'అని ఎస్ఐఏ బృందం నిపుణుడు దేవరాజ్ తెలిపారు. అలాగే కారిడార్–3లో మొత్తం 26 నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలు నష్టపోతున్నాయని వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా చాలా మంది నిర్వాసితులు మెట్రో రైల్ స్టేషన్లను ప్రైవేట్ భూముల కంటే ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్వాసితుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలను నమోదు చేసుకుని నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఎస్ఐఏ బృందం తెలిపింది. కార్యక్రమంలో ఎస్ఐఏ బృందం పర్యావరణ, సామాజిక నిపుణుడు మాధవ్‌రెడ్డి, పి. దేవరాజ్, డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌కు చిక్కిన గంజాయి

ఇద్దరు అరెస్ట్, 200 గ్రాముల గంజాయి స్వాధీనం

పెందుర్తి: అసాంఘిక కార్యకలాపాల నిషేధం కోసం పెందుర్తి పోలీసులు వినూత్నంగా చేపడుతున్న డ్రోన్ సర్వేలో శుక్రవారం ఇద్దరు గంజాయి వినియోగదారులు చిక్కారు.

సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డ్రోన్ పర్యవేక్షణలో భాగంగా సుజాతనగర్‌లోని నాగమల్లి లేఅవుట్ కొండవాలు ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు డ్రోన్ ఎగురవేశారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు సంచులతో అనుమానాస్పదంగా తిరగడాన్ని గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లి పరిశీలించగా గంజాయిని వినియోగించి మిగిలిన గంజాయిని తుప్పల్లో దాచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.


సుజాతనగర్ నాగమల్లి లేఅవుట్ శివారులో డ్రోన్‌కు చిక్కిన గంజాయి వినియోగదారులు